సాక్షి నిర్మల్

మంగళవారం | 27 | ఆగస్టు | 2024



విషజ్వరాలు బాబోయ్..

సారంగాపూర్ మండలంలో గ్రామాలను విష జ్వరాలు వణికిస్తున్నాయి. చికున్ గున్యా, డెంగీ జ్వరాలతో ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున మంచం పట్టారు. 8లో▸

అథ్లెటిక్స్‌లో ప్రతిభ



ముధోల్: మండలంలోని అష్ట గ్రామానికి చెందిన బాలాయిగారి సుగుణ-శేఖర్‌ల కుతూరు స్వాతి అథ్లెటిక్స్‌లో రజత పతకం సాధించింది. మెదక్‌లోని ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ స్టేట్ పదో సీనియర్ అండర్-23 అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రజత పతకం కైవసం చేసుకుంది.మాజీ సర్పంచ్ సుకన్య రమేశ్, ఉప సర్పంచ్ సునీల్, సెక్రటరీ గంగాధర్, కారోబారి బోజారెడ్డి స్వాతిని అభినందించారు.

గరిష్టం/కనిష్టం
31.1 /24.4

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉక్కపోత పెరుగుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేకు ట్రిపుల్ ఐటీ కార్మికుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

బాసర: బాసర ట్రిపుల్ ఐటీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 190 మంది కార్మికులు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను సోమవారం కలిశారు. తాము మూడేళ్లుగా ఫస్ట్ మెయిన్ సర్వీస్ కంపెనీ తరఫున ట్రిపుల్ ఐటీలో పని చేస్తున్నామని తెలిపారు. కంపెనీ పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సమస్యను యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం రాలేదని తెలిపారు. కలెక్టర్కు వినతిపత్రం ఇచ్చామని పేర్కొన్నారు. తమకు జీవో 71 ప్రకారం వేతనాలు ఇస్తున్నారని, జీవో 61 ప్రకారం కార్మికుల రూ.16,500 ఇవ్వాలని కోరారు. పెరిగిన వేతనాలను మూడేళ్లుగా ఇవ్వడం లేదని తెలిపారు. అధికారులను అడిగినందుకు ఐదుగురు కార్మికులను 12 రోజులు సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీనెల కార్మికుల సమస్య గురించి మాట్లాడడానికి క్యాంపస్‌లో గంటసేపు గడపాలని కోరారు. 2015 నుంచి 2024 వరకు కార్మికులను వేతనాలను పెంచడం లేదని తెలిపారు.

పురస్కార గ్రహీతకు సన్మానం



కత్తికిరణ్‌ను సన్మానిస్తున్న సంఘసభ్యులు

నిర్మల్‌ఖిల్లా: ఇటీవల తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్మల్ జిల్లాకు చెందిన చలనచిత్ర, టీవీ కళాకారుల సంఘం సభ్యుడు డాక్టర్ కత్తి కిరణ్‌కు 'ఐకాన్ అవార్డు' లభించింది. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా చలనచిత్ర టీవీ కళాకారుల అసోసియేషన్ తరఫున కత్తి కిరణ్‌ను ఘనంగా సన్మానించారు. తమ అసోసియేషన్ సభ్యుడికి రాష్ట్రస్థాయి పురస్కారం లభించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అడిచర్ల రాజు, ఉపాధ్యక్షుడు కమలాకర్, ప్రధాన కార్యదర్శి కోటగిరి నరసయ్య, కార్యవర్గ సభ్యులు కృష్ణవర్మ, వెన్నెల రాజేందర్, మోహన్‌రావు, శ్రీనివాస్, మహమ్మద్‌ఖాన్, సూర్యప్రకాశ్, గోపివర్మ, మేరీమాత, గణేశ్, సురేశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అధికారికి సన్మానం



శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్‌టౌన్: జిల్లా క్రీడల అధికారిగా శ్రీకాంత్ రెడ్డి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు. నిర్మల్‌లోని స్టేడియాలను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, వేమన ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు బుక్క రమేష్, కార్యదర్శి భోజన్న, స్కూల్ గేమ్స్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, రమణారావు, భూమన్న, శ్రీనివాస్, సుందర్ సింగ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న మహిళా భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నటరాజ్ నగర్ శివాలయం నుంచి కదిలి పాప హరేశ్వరస్వామి ఆలయం వరకు సాయి దీక్ష సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మహా పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని శివసాయి నామస్మరణంతో ముందుకు సాగారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మహా పాదయాత్రను ప్రారంభించారు. లోక కళ్యాణం కోసం 8 ఏళ్లుగా ఏటా శ్రావణమాసం చివరి సోమవారం సాయిదీక్ష సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ గొప్ప కార్యం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..



పల్లకి ఊరేగింపులో కోలాటం ఆడుతున్న చిన్నారులు



లక్ష్మణచాందలో రాధాకృష్ణుల వేషధారణలో..



కుభీర్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే జిల్లాలోని వైష్ణవాలయాలు కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక ఇళ్లలో చిన్నారులను చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణతో ముస్తాబు చేశారు. గ్రామాలు, పట్టణాలు, విద్యాలయాల్లో ఉట్టికొట్టే వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మురళీకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు, సుందర సత్సంగ్ నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి స్వామివారికి అభిషేకం, అష్టకం హారతి, పల్లకి సేవ నిర్వహించారు. శోభాయాత్రలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయంలో సుందర సత్సంగ్ సభ్యులు పారాయణం చేశారు.

– నిర్మల్‌టౌన్

నెలకోరోజు హాస్టల్ నిద్ర

- నెలకోసారి నిర్వహించాలని సీఎస్ ఆదేశాలు..
- గురుకులాల పకడ్బందీ నిర్వహణపై ప్రభుత్వం దృష్టి..
- వసతిగృహాల్లో సౌకర్యాలలేమిపై ప్రత్యేక చర్యలు



నిర్మల్ గురుకుల విద్యాలయంలో నీటివసతిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌ఖిల్లా: 'కలెక్టర్లు తమ జిల్లాల పరిధిలోని ఏదైనా గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల్లోని హాస్టళ్లలో నెలలో ఒకరోజు కచ్చితంగా రాత్రి నిద్ర చేయాలి. ఆయా పాఠశాలలు, హాస్టళ్లు తనిఖీ చేసి తాము గుర్తించిన, పరిశీలించిన అంశాలను డైరీలో నమోదు చేయాలి. కలెక్టర్ల బస ద్వారా గురుకుల హాస్టల్‌లో స్థితిగతులు తెలుసుకోవాలి' ఇవీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జారీ చేసిన కీలక ఆదేశాలు.

రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే గురుకుల పాఠశాలలు, కళాశాలల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఉమ్మడి జిల్లాలో బీసీ సంక్షేమ, సాంఘిక సంక్షేమ, గిరిజన, ఆశ్రమ పాఠశాలలు కొనసాగుతున్నాయి. వీటిల్లో హాస్టల్‌తో కూడిన బాలురు, బాలికల కోసం ప్రత్యేక వసతులతో విద్యాలయాలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో కొన్ని నెలలుగా ఫుడ్ పాయిజన్, వైరల్ జ్వరాలు, సౌకర్యాల కొరతపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు సైతం ప్రధానంగా ఈ సమస్యలను ప్రస్తావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతీనెల కలెక్టర్ జిల్లా పరిధిలోని ఏదైనా ఒక గురుకుల హాస్టల్‌లో రాత్రి నిద్ర ద్వారా తగిన తనిఖీ, పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ జిల్లాలో గతంలో ఓ కేజీబీవీ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇక నూతనంగా ఏర్పడిన మహాత్మ జ్యోతిబాపూలే, మైనారిటీ, సాంఘిక సంక్షేమ పాఠశాలలు, కస్తూరిబా పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో తగిన వసతి సౌకర్యాలు లేవని విద్యార్థులు, తల్లిదండ్రుల పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ల 'ఒకరోజు హాస్టల్ నిద్ర' అనే కార్యక్రమం ద్వారా సౌకర్యాల కొరత, విద్యార్థులకు పొందుతున్న వసతి సౌకర్యాలు, ఎదుర్కొంటున్న ఇక్కట్లు వంటి అంశాలు అధికా రుల దృష్టికి రానున్నాయి. ప్రతీనెల తమ టూర్ డైరీలో కచ్చితంగా ఒకరోజు హాస్టల్ నిద్రచేసి నివేదిక రూపొందించాలన్న ఉత్తర్వుల ద్వారా గురుకుల విద్యాలయాల సమస్యలు సత్వరమే పరిష్కారమయ్యే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో అన్నిరకాల గురుకుల విద్యాసంస్థలు కలిపి దాదాపు 77 పాఠశాలలు, కళాశాలలు కొనసాగుతున్నాయి. అందులో సాంఘిక సంక్షేమ- 22, గిరిజన సంక్షేమ- 11, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ- 26, మైనారిటీ సంక్షేమ -17, రాష్ట్ర సంక్షేమ-01 ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలు..

తెలంగాణ సాంఘిక సంక్షేమ	22
గిరిజన సంక్షేమ	11
మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ	26
తెలంగాణ రాష్ట్ర సంక్షేమ	01
మైనార్టీ సంక్షేమ	17
మొత్తం	77

మంచి నిర్ణయం...



గురుకుల వసతి గృహాల సక్రమమైన నిర్వహణ కోసం క్రమబద్ధమైన రీతిలో తనిఖీలు నిర్వహించడం మంచి నిర్ణయం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం శుభ పరిణామం. ప్రతీనెల జిల్లా కలెక్టర్లు జిల్లా పరిధిలోని గురుకుల విద్యాలయ వసతి గృహంలో ఒక రోజు రాత్రి నిద్రించడం ద్వారా విద్యార్థులకు సౌకర్యాలు అందుతున్న తీరు, నిర్వహణ లోపాలు అధికారుల దృష్టికి వస్తాయి. వాటి పరిష్కారానికి అవకాశం ఉంటుంది.

– కుమ్మరి వెంకటేశ్, బీజేవైఎం జిల్లా నాయకుడు

పకడ్బందీ పర్యవేక్షణతో వసతులు..



గురుకుల పాఠశాలల్లోని హాస్టళ్లలో ఇప్పటికీ కొన్ని సౌకర్యాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కలెక్టర్లు ప్రతీనెల హాస్టల్‌ను సందర్శించి అక్కడ అందుతున్న సౌకర్యాలను తనిఖీ చేయడం వల్ల విద్యార్థులకు సరైన వసతులు అందుబాటులోకి వస్తాయి. ముఖ్యంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతి గృహాల పరిస్థితి దయనీయంగా ఉంది. వీటిపై ప్రత్యేక దృష్టిసారించాలి.

– కైరి శశి, ఏబీవీపీ జిల్లా కన్వీనర్

జిల్లాలో ఇలా..

- జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపూలే పాఠశాల ఇరుకు అద్దె భవనంలో కొనసాగుతుంది. గతేడాది విద్యార్థులంతా విషజ్వరాలబారిన పడ్డారు.
- జిల్లాలోని ఓ కస్తూర్బా పాఠశాలలో గతంలో ఫుడ్ పాయిజన్ కావడంతో విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాల్సి వచ్చింది.
- ప్రస్తుతం వర్షాకాల సీజన్ కొనసాగుతున్నందున చాలా వరకు గురుకుల వసతి గృహాలు ఉన్న పాఠశాల ఆవరణలో ప్రహరీలు లేక పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయి. విద్యార్థులకు సరైన భద్రత ఉండడం లేదు.

ప్రధానంగా పరిశీలించే అంశాలు ఇవే...

- గురుకుల వసతి గృహంలో మౌలిక సదుపాయాల తీరు, తరగతి గదులు, డార్మిటరీ సౌకర్యం, వసతి గదుల్లో విద్యుత్తు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం.
- విద్యార్థుల సంఖ్య కనుగుణంగా కిచెన్ డైనింగ్ హాల్, నిర్దేశిత మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్న తీరు.
- పాఠశాల హాస్టల్ పరిసరాలు ఆవరణ పరిశుధ్య నిర్వహణ.. విద్యార్థుల భద్రత పాఠశాల చుట్టూ ప్రహరీ రక్షణ, పర్యవేక్షణ తదితరాలు..
- బోధన, బోధనేతర సిబ్బంది సక్రమమైన విధుల నిర్వహణ....

సీజనల్ జ్వరాలపై 'సాక్షి' ఫోన్ ఇన్



డాక్టర్ రాజేందర్
డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. డెంగీ, చికున్‌గున్యాతో ప్రజలు మంచంపడుతున్నారు. జ్వరం ఉన్నప్పుడు ప్లేట్‌లెట్స్ తగ్గడం, జ్వరం నుంచి కోలుకున్న తర్వాత ఒంటి నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యంలో సీజనల్ వ్యాధుల వైద్యం, సందేహాలు, వైద్య సలహాల కోసం జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో జ్వరాలపై సందేహాలు, వైద్య సలహాలు పొందవచ్చు, సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

సమయం : మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

సెల్‌ఫోన్ నంబర్: 98496 53126

డిపో మేనేజర్‌కు సన్మానం



డిపో మేనేజర్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

నిర్మల్‌టౌన్: ఉత్తమ ప్రగతిచక్రం అవార్డు అందుకున్న ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డిని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు సోమవారం సత్కరించారు. డిపోను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నిలిపి రాష్ట్రస్థాయిలో అవార్డు తీసుకురావడం అభినందనీయమని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం డిపో మేనేజర్‌ను ఆర్టీసీ ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు సన్మానించారు. డీఎం ప్రతిమారెడ్డి మాట్లాడుతూ.. సమష్టి కృషితోనే ఈ అవార్డు సాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్ నవీన్‌కుమార్, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి



మందపల్లిలో మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

- ఎస్పీ జానకీ షర్మిల

పెంబి: యువత గంజాయి, డ్రగ్స్, మద్యం లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. మండలంలోని మందపల్లి గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్పీ ప్రారంభించారు. ద్విచక్ర వాహనాదారులకు హెల్మెట్, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం వేణునగర్ గ్రామంలోని గిరిజనులకు చీరలు, కూరగాయలు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మందపల్లి గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఒక కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వలన దొంగతనాలు, అల్లర్లు చేసిన వారిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువులో ముందుండి ఉన్నతమైన బాధ్యతలు చేపట్టి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు సంభందిత ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

ఎస్పీ భావోద్వేగం..

మండలంలో వేణునగర్ గ్రామంలోని గిరిజనులు 50 ఏళ్లకే చనిపోతున్నారని గ్రామస్తులు తెలిపారు. నిత్యం కిలోమీటర్లు దూరం అడవిలోకి నడుచుకుంటూ వెళ్లి వెదురు తీసుకువచ్చి బుట్టలు, తడకలు అల్లుతూ వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సరైన తిండి లేక.. 50 ఏండ్లకే మగవారు చనిపోవడంతో తాము ఒంటరవుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కుటుంబ పోషణ భారమై కనీసం చదివించే పరిస్థితి లేదని గ్రామపెద్ద ఎస్పీ జానకీ షర్మిల దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. గిరిజనులకు తన వంతుసాయం అందిస్తానని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో బడి మానేయవద్దని సూచించారు. ఆర్థికసాయం కావాలంటే తనను సంప్రదించాలని గ్రామపెద్దకు ఫోన్ నంబర్ ఇచ్చారు.

ఎన్నాళ్లీ వెట్టిచాకిరీ..



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

- విధులు బహిష్కరించిన నిర్మల్ పారిశుధ్య కార్మికులు
- నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని నిరసన
- 24 గంటల్లో పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని హెచ్చరిక

నిర్మల్‌టౌన్: వారంతా పారిశుధ్య కార్మికులు. నెల నెలా వేతనాలు అందితేనే ఇల్లు గడిచేది. కానీ, నాలుగు నెలలుగా వారికి వేతనాలు రావడం లేదు. ఇన్నాళ్లు ఓపిక పట్టిన నిర్మల్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సోమవారం విధులు బహిష్కరించారు. బల్దియా కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో ఇల్లు గడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు అడిగితే అధికారులు రేపు మాపు అని దాటవేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మల్ మున్సిపాలిటీలో 15 మంది రెగ్యులర్ కార్మికులు, 257 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నట్లు తెలిపారు.


నాలుగు నెలలుగా ఎదురు చూపు..

నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కార్మికులు సోమవారం విధులు బహిష్కరించారు. జీతాలు ఇవ్వకుంటే పూట గడవడం కష్టంగా ఉందని.. పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. సూర్యుడు ఉదయించక ముందే రోడ్లు, డ్రైనేజీలో శుభ్రం చేసే తమకు మున్సిపల్ అధికారులు సకాలంలో జీతాలు చెల్లించాలని వేడుకున్నారు.

స్పందించకుంటే సమ్మె తప్పదు..

24 గంటల్లో వేతనాలు చెల్లించకుంటే.. సమ్మె చేస్తామని కార్మికులు హెచ్చరించారు. తమ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సమ్మె చేస్తే చెత్త పేరుకుపోయి ప్రజలు వ్యాధుల బారిన పడతారని తెలిపారు. అధికారులు వెంటనే తమ జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కష్టంగా కుటుంబ పోషణ..



నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మా జీతాలు ఇవ్వాలి. జీతాలు రాక కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నాం. పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేదు. మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని స్పందించడం లేదు. ఇన్సూరెన్స్ సౌకర్యం లేదు.

– భీమ్‌దాస్ మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుడు

నిధులున్నా ఇవ్వడం లేదు



మున్సిపల్‌లో స్టేట్ సెంట్రల్, ఫండ్స్ ఉన్నా జీతాలు ఇవ్వకుండా మాతో పని చేయించుకుంటున్నారు. ఎన్నిసార్లు అడిగినా దాటవేస్తున్నరు. సూర్యుడు ఉదయించక ముందు రోడ్డుపైకి వచ్చి పాచి పని చేసే మా జీతాలు ఆపడం న్యాయం కాదు.

– దేవదాస్ పారిశుధ్య కార్మికుడు

రెండు నెలల వేతనాలే పెండింగ్..



జూన్, జూలై జీతాలే పెండింగ్‌లో ఉన్నాయి. జూన్ నెల వేతనం బుధవారం చెల్లిస్తాం. పన్నులు వసూలు కాకపోవడంతో వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కార్మికులకు బడ్జెట్ నుంచి వేతనాలు ఇవ్వడానికి వీలు లేదు. వసూలైన పన్నుల నుంచే చెల్లించాలి.

– సీవీఎస్.రాజు మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

బాసరలో శ్రావణ సోమవారం పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బాసర: బాసరలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీపాపహరేశ్వర ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం నాలుగో సోమవారం కావడంతో ఆలయం శివనామ స్మరణలతో మార్మోగింది. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామున దర్శనం కోసం భక్తులు బారులుతీరారు. ఆలయ పూజారులు స్వామి శివలింగాకారానికి భస్మ హారతి ఇచ్చారు. అత్యంత అద్భుతమైన ఆ దృశ్యాన్ని చూసేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

యువ రైతు మృతి



సంతోష్ (ఫైల్)

లక్ష్మణచాంద: అనారోగ్యంతో యువ రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పీచర గ్రామానికి చెందిన రైతు బుర్రి సంతోష్ (38) గత బుధవారం గ్రామ సమీపంలోని పంటచేనుకు వెళ్లి అక్కడ కొంతసేపు పని చేశాడు. అనంతరం విశ్రాంతికోసం చెట్టు కిందకు వచ్చి కుప్పకూలిపోయాడు. తల్లి గంగవ్వ వెళ్లిచూడగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో రెండు రోజులు చికిత్స పొందిన అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అధిక రక్తపోటుకు గురికావడంతో నరాలు చిట్లి రక్తస్రావం జరిగినట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు.

మహిళను కాపాడిన పోలీసులు



మహిళను అప్పగిస్తున్న పోలీసులు

బాసర: భైంసా పట్టణానికి చెందిన సవిత బాసర గోదావరినది వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో జాలర్లు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భైంసాకు చెందిన సావిత్రి బీడీ కార్మికురాలిగా ఆమె భర్త దిగంబర్ ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినట్లు పేర్కొంది. మహిళ భర్తకు సమాచారం అందించి అప్పగించినట్లు మొబైల్ పెట్రోలింగ్ పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

పాపహరేశ్వరాలయంలో భక్తుల సందడి



ఆలయ ప్రాంగణంలో భక్తులు

దిలావర్‌పూర్: నిర్మల్ జిల్లాలోని అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం గల శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం, కాల్వ అటవీప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాలు సోమవారం భక్తులతో పోటెత్తాయి. శ్రావణ మాసప్రత్యేక పూజల సందర్భంగా అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కదిలి పాపహరేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మహిళలు అన్నపూర్ణేశ్వరీ దేవి చెంత కుంకుమార్చన నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో ఉపవాస దీక్షలు విరమించారు.

కిరాణ షాపులో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన అందె సురేష్ ఇంటి వద్ద కిరాణ షాపు నడుపుతున్నాడు. రోజులాగే ఆదివారం రాత్రి 10 గంటలకు దుకాణం మూసివేశాడు. సోమవారం తెల్లవారుజామున బయటకు వద్దామని తలుపు తీసేందుకు ప్రయత్నించగా బయట నుంచి గొళ్లెం పెట్టి ఉంది. దీంతో తన సోదరుని కుమారుడికి ఫోన్ చేసి విషయం తెలుపగా అతను వచ్చే సరికి కిరాణ షాపు తలుపులు పగులగొట్టి ఉన్నాయి. షాపులో నుంచి రూ.వెయ్యి నగదుతో పాటు మరో రూ.వెయ్యి విలువైన కిరాణ సామాగ్రిని తీసుకెళ్లినట్లు గుర్తించాడు. టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై విష్ణుప్రకాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిశువులకు సంజీవని

- నవజాత శిశువులకు నియోనాటల్ కేర్ అంబులెన్స్
- జిల్లాకొకటి చొప్పున గతేడాది ఇదే రోజున ప్రారంభం
- ఎంతోమంది చిన్నారుల ప్రాణాలు కాపాడిన వాహనం



అంబులెన్స్‌లో శిశువును తరలిస్తున్న సిబ్బంది



మంచిర్యాలకు సేవలు అందిస్తున్న నియోనాటల్ కేర్ అంబులెన్స్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఓ గర్భిణి ఏడు నెలల్లోనే ప్రసవించింది. శిశువు 900 గ్రాముల బరువుతో జన్మించగా.. ఆ శిశువు గుండెలో సమస్య ఉందని వైద్యులు గుర్తించారు. వెంటనే నియోనాటల్ కేర్ అంబులెన్స్‌లో ఆ శిశువును హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. ఇలా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు అంబులెన్స్‌లు గత ఏడాది కాలంలో 2,392మందిని వివిధ ఆస్పత్రులకు తరలించాయి. నవజాత శిశువుల్లో అనారోగ్య సమస్యలు ఎదురైతే సరైన సమయానికి వైద్యం అందించేందుకు వరంగల్, హైదరాబాద్ నగరాలకు తరలిస్తూ నియోనాటల్ కేర్ అంబులెన్స్‌లు సంజీవనిలా నిలుస్తున్నాయి. గత ఏడాది ఆగస్టు 27న ఉమ్మడి జిల్లాలో జిల్లా కొకటి చొప్పున ప్రారంభించారు. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల్లో మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పుట్టిన శిశువుకు ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే సరైన సమయానికి మెరుగైన వైద్యం అందించేందుకు వరంగల్, హైదరాబాద్ వంటి నగరలకు శిశువులను తరలించేందుకు ఈ నియోనాటల్ కేర్ అంబులెన్స్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అప్పుడే పుట్టిన శిశువుకు ఆపద వస్తే తల్లి నుంచి దూరంగా పిల్ల ల ఆస్పత్రుల్లో చేర్చాల్సి వస్తుంది. హైదరాబాద్ వంటి నగరాలకు ఆ చిన్నారులను తరలించేందుకు అంబులెన్స్‌లు సంజీవనిలా మారాయి. ఐసీయూ సౌకర్యంతో వైద్యం అందిస్తూ ఉచితంగా తరలిస్తున్నారు.

అన్ని రకాల వసతులు

ఈ అంబులెన్స్‌ల్లో అన్ని రకాల వసతులు ఉన్నాయి. మినీ ఐసీయూగా ఏర్పాటు చేశారు. ఆధునిక టెక్నాలజీతో రూపొందించగా నిర్వహణ బాధ్యతలు జీవీకే ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఈఎంఆర్‌ఐ)కి అప్పగించారు. ఆస్పత్రిలో ఉండే ఇంటెన్సివ్ కేర్ యూనిట్ స్థాయి వసతులు కల్పించారు. మందులు, ఆక్సిజన్, వెంటిలేటర్ సదుపాయాలతోపాటు అత్యవసర వైద్యసేవలకు శిక్షణ పొందిన మెడికల్ టెక్నీషియన్ ఉన్నారు. వైద్యసేవలతోపాటు సకాలంలో ఆస్పత్రికి చేర్చి వారి ప్రాణాలు కాపాడుతూ తల్లిదండ్రుల్లో ఆనందాన్ని నింపుతున్నారు.

ఏడాది కాలంలో శిశువులకు అందిన సేవలు

నెల	ఆదిలాబాద్	కుమురంభీమ్	మంచిర్యాల	నిర్మల్
ఆగస్టు	04	04	10	05
సెప్టెంబర్	32	20	45	20
అక్టోబర్	40	25	40	32
నవంబర్	50	41	55	40
డిసెంబర్	47	41	59	42
జనవరి	60	40	62	51
ఫిబ్రవరి	52	38	52	45
మార్చి	79	35	62	47
ఏప్రిల్	78	45	60	51
మే	60	44	61	56
జూన్	62	49	55	47
జూలై	68	52	66	48
ఆగస్టు	60	52	60	43
మొత్తం	692	486	687	527

శిశువుల కోసం ఏర్పాటు



అత్యవసరంగా చిన్నారులను హైదరాబాద్ వంటి నగరాలకు త్వరగా చేర్చి వారికి సకాలంలో వైద్యం అందించేందుకు అంబులెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎంతోమంది శిశువులకు సకాలంలో ఆసుపత్రికి చేర్చే అవకాశం దక్కింది. – ఎల్.రమేష్, పైలట్, మంచిర్యాల

ప్రాణాలు కాపాడుతున్నాం



శిశువుల కోసం ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో టీఆర్ వినికా సదుపాయాలు కూడా కలిగి ఉన్నాయి. దీంతో శిశువులకు వైద్యం అందిస్తూ సకాలంలో ఇతర ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడుతున్నాం.

– టి.శ్రీనివాస్, ఈఎంటీ, మంచిర్యాల

గంజాయిపై ఉక్కుపాదం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాయినాథ్

జైనథ్: గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని సీఐ డి.సాయినాథ్ తెలిపారు. డ్రగ్స్ తీసుకునే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ప్రతి పోలీస్ స్టేషన్‌కు డ్రగ్స్ పరీక్షించే కిట్లను అందజేసినట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఎస్సై పురుషోత్తంతో కలిసి మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా సమీపంలోని హైవే క్యాంటీన్ వద్ద నాగపూర్‌కు చెందిన అఫ్సర్ ఖాన్ గంజాయి సేవిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా 46 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ గంజాయిని నాగపూర్‌లోని అశ్వాక్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ వద్ద విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుడిపై ఇదివరకే ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో చోరీ కేసుతో పాటు మహారాష్ట్రలో కూడా పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. వారం రోజుల క్రితం ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో గల ఓ పెట్రోల్‌బంక్‌లో మొబైల్ చోరీ చేయగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. గంజాయి సాగు చేసిన వారికి ఎలాంటి ప్రభుత్వ పథకాలు కూడా అందకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని సీఐ వివరించారు.

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ



మాట్లాడుతున్న ఏటీడీవో నిహారిక

ఆదిలాబాద్‌రూరల్: వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుంది. అయితే ఆయా శాఖల పరిధిలో కొనసాగుతున్న వసతి గృహాల్లో ఎంత మంది సిక్ అయి ఉన్నారనే విషయాన్ని ప్రతీరోజు అధికారులు రిపోర్టు తెప్పించుకుంటుంటారు. కొన్ని వసతి గృహాలకు చెందిన సిబ్బంది అక్కడ విద్యార్థులు సిక్కయినప్పటికీ కాలేదని సమాధానం చెప్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఐటీడీఏ పరిధిలో కొనసాగుతున్న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన కొలాం ఆశ్రమ పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆదివారం సంబంధిత వసతి గృహ నిర్వాహకులను అడిగారు. ఒక్కరు కూడా లేరని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అదేరోజు కొద్దిసేపటి తర్వాత 15 మంది విద్యార్థులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. వారివెంట సిబ్బంది ఒక్కరే వెళ్లడంతో గమనించిన ఒకరు ఫొటో తీసి ఐటీడీఏ పీవోకు పంపించినట్లు సమాచారం. గమనించిన పీవో సంబంధిత ఏటీడీవోతో మాట్లాడి ఆరా తీసినట్లు సమాచారం. దీంతో ఆమె అదే రోజు సాయంత్రం వసతి గృహానికి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ విషయంపై 'సాక్షి' ఏటీడీవో నిహారికను సంప్రదించగా విద్యార్థులను ఆసుపత్రికి తీసుకెళ్లినా సందర్భంలో సంబంధిత హెచ్‌ఎం సైతం వారి వెంట వెళ్లాల్సి ఉందన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం నారాయణ్‌రావుకు సోమవారం ఐటీడీఏ పీవో షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

విషపూరిత నీళ్లు తాగి పది మేకలు మృతి



మృతి చెందిన మేకలు

సారంగపూర్: మండలంలోని కుప్టిలో విషపు నీళ్లు తాగి పది మేకలు మృతి చెందాయి. కుంటాల మండలం దౌనెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దౌనెల్లి తండాకు చెందిన ఆడె సుభాష్ కుప్టి గ్రామంలో ఆదివారం దాదాపు 50 మేకలను మేతకోసం అడవికి తీసుకెళ్లాడు. సాయంత్రం మందను ఇంటికి తరలించే సమయంలో కుప్టి గ్రామ సమీపంలోని వాగులో మేకలకు నీళ్లు తాగించి పశువుల పాకలో తోలాడు. భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. రాత్రి వచ్చి చూడగా మేకలు ఎక్కడికక్కడే పడిఉండడం గమనించాడు. విషయాన్ని స్థానికులకు, తోటి పశువుల కాపరులకు తెలపడంతో వారు స్థానిక పశువైద్యాధికారికి సమాచారం అందించారు. డాక్టర్ శ్రీకర్‌రాజు ఘటనా స్థలానికి వెళ్లి మేకలకు చికిత్స అందించాడు. అయినా 10 మేకలు మృతి చెందాయి. మృతి చెందిన మేకల విలువ దాదాపు రూ.లక్షా 30వేల వరకు ఉంటుందని బాధితుడు సుభాష్ రోదిస్తూ తెలిపాడు.

కుక్కలదాడిలో మేక మృతి



మృతి చెందిన మేక

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లెలో గుగ్లావత్ కిషన్‌కు చెందిన మేకల మందపై ఊరకుక్కలు దాడి చేసిన ఘటనలో మేక మృతి చెందింది. ఎప్పటిలాగే సోమవారం గ్రామశివారులో మేకలను మేపే క్రమంలో 10కి పైగా ఊరకుక్కలు మేకల మందపై దాడి చేశాయి. దాడిలో ఒక మేక మృతి చెందగా, పలు మేకలకు గాయాలయ్యాయి. ప్రభుత్వం పరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

చెట్ల నరికివేతపై విచారణ

ముధోల్: ముధోల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చెట్ల నరికివేతపై సోమవారం అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఆదివారం ఆసుపత్రిలోని చెట్లను నరికి వేసినట్లు దినపత్రికల్లో ప్రచురితం కావడంతో అటవీశాఖ అధికారులు స్పందించి విచారణ జరిపారు. ఈ విషయమై ఆస్పత్రి సిబ్బందికి నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ గుగ్లావత్ నంద్యా, బీట్ ఆఫీసర్ కృష్ణ పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

నిర్మల్‌టౌన్: పట్టణంలో ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. స్థానిక విశ్వనాథ్‌పేట్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తుండగా పక్కా సమాచారంతో ఎస్సై రవీందర్ సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించగా షేక్ అఫ్రోజ్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి రూ.27వేల నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కుంటాల: పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్.భాస్కరాచారి తెలిపారు. అంబకంటి గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు గొడవపడి సోమవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అతిగా మద్యం సేవించి వచ్చిన సాయేందర్ పోలీసులతో దురుసుగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితుడిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయనున్నట్లు ఎస్సై వెల్లడించారు.

తండావాసుల చేతిలో కొండచిలువ హతం



కొండచిలువను చూపుతున్న తండావాసి

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వతండాలో సోమవారం జాదవ్ లక్ష్మణ్ ఇంట్లో భారీ కొండ చిలువ కనిపించింది. భయాందోళన చెందిన లక్ష్మణ్ గ్రామస్తులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న తండావాసులు కొండచిలువను హతమార్చారు. దాదాపు ఐదు మీటర్ల పొడవుతో ఉన్న కొండచిలువను చూసి తండావాసులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు.

ఏజెన్సీ బంద్ విజయవంతం చేయాలి

- తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేశ్



మాట్లాడుతున్న గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: ఏజెన్సీ ప్రాంత రక్షణకోసం భారత రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ నేడు చేపట్టనున్న ఏజెన్సీ ప్రాంత బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేశ్ పిలుపునిచ్చారు. సోమవారం మావల మండలంలోని కుమురంభీం కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ వలస లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించడంతో పాటు జీవో 3 యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ ఏరియాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించాలని, 40 శాతం ఆదివాసీలు ఉన్న గ్రామాలను ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తిస్తూ ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీలో అవకాశం కల్పించాలన్నారు. 29 శాఖల్లో ఉన్న జీవోలను చట్టంగా చేయాలని, ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కుపత్రాలు మంజూరు చేసి గిరి వికాసం ద్వారా బోరుబావులు మంజూరు చేయాలన్నారు. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఐటీడీఏలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. తొమ్మిది తెగల ప్రజలు, గ్రామ పటేళ్లు, సార్‌మేడీలు, విద్యార్థి సంఘాల నాయకులు, యువతీ యువకులు, కార్మిక కర్షక, వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల నాయకులు, చిరు వ్యాపారులు, వాణిజ్య, వర్తక వ్యాపారులు, కళాకారులు, ఆదివాసీ సంఘ నాయకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు వెట్టి మనోజ్, గోడం రేణుక, ఉయిక ఇందిర, సలాం వరుణ్, సోయం లలిత, తొడసం ప్రకాష్, గోవిందరావు, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

'బంద్‌కు లంబాడీల మద్దతు అనవసరం'



మాట్లాడుతున్న పుర్క బాపురావు

ఉట్నూర్‌రూరల్: సమస్యల పరిష్కారం కోసం ఆదివాసీల ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేటి బంద్‌కు లంబాడీల మద్దతు అనవసరమని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు, మాజీ అధ్యక్షుడు ఆత్రం తిరుపతి అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లంబాడీల వల్లే తాము ఉద్యోగ, ఉపాధి కోల్పోయి అన్ని రకాలుగా నష్టపోయామన్నారు. ఇప్పటికే 29 శాఖల్లో పూర్తిగా ఉద్యోగాలు వారే అనుభవిస్తున్నారన్నారు. కావున మా ఉద్యమాలకు వారి మద్దతు అవసరం లేదన్నారు. అయినా మా మొదటి డిమాండ్ లంబాడీలను తొలగించాలని ఉందన్నారు. సమావేశంలో నాయకులు హరిప్రసాద్, త్రిమూర్తి, జంగుదేవ్, తుకారాం, కిషన్, మోతీరాం, బాపురావు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న కుడ్మెత మనోహర్

ఇంద్రవెల్లి: ప్రభుత్వ నిబంధనలు పాటించని, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రుల యజమానులపై కఠినచర్యలు తీసుకుంటామని ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడ్మెత మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హోలీ ట్రినిటీ ఆస్పత్రిని తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలతో పాటు సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితిలో వైద్యం అందించే వార్డులను పరిశీలించారు. నిర్వాహకులు 2017లో పొందిన అనుమతితో ఆస్పత్రి నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేని దవాఖానాలు వెంటనే అనుమతులు పొందాలన్నారు. అధిక డబ్బులు వసులు చేసి ప్రజలను మోసగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవోలు నాందేవ్, పవార్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ జాదవ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఇంద్రవెల్లి: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడ్మెత మనోహర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులకు రాకుండానే హాజరు వేసుకున్న హెల్త్ అసిస్టెంట్ వినోద్, అప్తాల్మిక్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, అంటెండర్ స్వామికి మెమోలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు శ్రీకాంత్, హెల్త్ సూపర్ వైజర్ జాదవ్ శ్రీనివాస్, హెచ్‌ఈవోలు నాందేవ్, పవార్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలోని ప్రైవేటు ఆస్పత్రులను సోమవారం అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్ తనిఖీ చేశారు. స్థానిక తిరుమల ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యం, వైద్యులు, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ కేసులను ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలని ఆదేశించారు. ఆయన వెంట డాక్టర్ మహేందర్, హెచ్‌ఈవో పవార్ రవీందర్, నాందేవు, హెచ్‌ఎస్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు పండగలా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

దిలావర్‌పూర్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండగలా చేపట్టాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిర్గాపూర్‌లో సోమవారం బీజేపీ అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రపంచంలోనే అతి పెద్దపార్టీగా అవతరించి మూడోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రి పగ్గాలు చేపట్టారన్నారు. ప్రతీ ఆరేళ్లకోసారి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతుందన్నారు. సెప్టెంబర్ 1న పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపీ నడ్డా అధికారికంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కమల్ నయన్, పార్లమెంట్ కన్వీనర్ అయన్నగారి భూమయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ శోభ సత్యనారాయణగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, రితేష్‌రాథోడ్, హరినాయక్, గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మ రాజు, పడిపెల్లి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని కలిసిన నేతలు



ఆర్మూర్ ఎమ్మెల్యేతో బీజేపీ నేతలు

నిర్మల్: అర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డిని పలువురు బీజేపీ జిల్లా, మండలాల నేతలు కలిశారు. దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్‌లో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన జిల్లా కేంద్రంలోని బీజేపీ తానూరు మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి ఇంట్లో మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నేతలు సత్యనారాయణగౌడ్, సాధు రాంరెడ్డి, అయిండ్ల భూపాల్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, తదితరులు కలిసి ఆయనతో మాట్లాడారు. జిల్లాలో పార్టీ మరింత బలపడేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

తల్లిని కోల్పోయిన చిన్నారులను ఆదుకుంటాం



నిత్యావసరాలు అందిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: తల్లిని కోల్పోయిన చిన్నారులను ఆదుకుంటామని శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రేమ్, అనిల్‌కుమార్, వైష్ణవి అన్నారు. సోమవారం మండలంలోని అందునాయక్‌తాండను సందర్శించారు. ఇటీవల మృతి చెందిన బాలింత వాగ్మరే కవల పిల్లల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు చిన్నారులతో పాటు కుటుంబ సభ్యులకు బట్టలు, పాలడబ్బాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. చిన్నారులను శిశు సంక్షేమ గృహానికి అందిస్తే అన్ని విధాలుగా సంరక్షణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మౌనికతాయి పాల్గొన్నారు.